

రంజోల్ పాలిటెక్నిక్ కళాశాలలో ఆవిష్కరణను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



జోగిపేట విద్యార్థులు ఆవిష్కరించిన ఎలక్ట్రిక్ స్కూటర్

# ఆవిష్కరణలతో ప్రతిభ వెలుగులోకి..

### రంజోల్ కళాశాలలో ఆకట్టుకున్న విద్యార్థుల ఆవిష్కరణలు

జహీరాబాద్, డిసెంబర్ 21: విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీస్తే ఆవిష్కరణలు సాధ్యమవుతాయని రంజోల్ సంగమేశ్వర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి అన్నారు. గురువారం జహీరాబాద్ మండలంలోని రంజోల్ సంగమేశ్వర పాలిటెక్కిక్ కళాశాలలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని జహీరాబాద్, గజ్వేల్, చేగుంట, నర్సాపూర్(గోమారం), జోగిపేట కళాశాలకు చెందిన విద్యార్థులు కొత్త పరిజ్ఞానంతో తయారు చేసిన పరికరాలను ఆవిష్కరించారు.



రంజోల్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఆవిష్కరించిన బహుళ ప్రయోజన జల్లెడ యంత్రం

జహీరాబాద్ కళాశాలకు చెందిన విద్యార్థులు బహుళ ప్రయోజన జల్లెడ యంత్రాన్ని తయారు చేసి ఆవిష్కరించారు. గజ్వేల్ కళాశాలకు చెందిన విద్యార్థులు వైర్‌లెస్ బహుళ ప్రయోజన వ్యవసాయ రోబోట్‌ను ఆవిష్కరించారు. నర్సపూర్‌కు చెందిన విద్యార్థులు 'రోబోటిక్' చేయితో నడిచే యంత్రాన్ని ప్రదర్శించారు. జోగిపేటకు చెందిన విద్యార్థులు పాత స్కూటర్‌ను ఎలక్ట్రిక్ స్కూటర్‌గా తయారు చేసి ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లాలోని కళాశాలకు చెందిన విద్యార్థులు మెకానిక్‌పై ప్రదర్శన ఇచ్చారు. విద్యార్థులు కొత్త పరిజ్ఞానంతో ఆవిష్కరణలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. రెండు ఆవిష్కరణలు ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మహీంద్ర అండ్ మహీంద్ర కంపెనీ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా టెక్‌ఫెస్ట్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 21: తమ కోర్సులో భాగంగా నేర్చుకున్న అంశాలను ప్రదర్శించి ప్రతిభను చాటేందుకు సృజన టెక్‌ఫెస్ట్ వేదికైంది. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులకు గురువారం మండల పరిధిలోని హనుమాన్ నగర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సృజన టెక్‌ఫెస్ట్ నిర్వహించారు. ఈ పోటీల్లో జోగిపేట, నారాయణఖేడ్, గజ్వేల్, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ సృజన టెక్‌ఫెస్ట్ పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న పరిజ్ఞానాన్ని వెలికితీసేందుకే ఉపయోగపడతాయన్నారు. ఈ పోటీల్లో జోగిపేట ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతి పొందగా, గజ్వేల్ జీఎంఆర్‌పీ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా ఈసీఈ కోఆర్డినేటర్ జి.మల్లికార్జున్, బీఎస్‌ఎన్‌ఎల్ ఏజీఎం వసంత, శ్రీదేవి ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ జగదీశ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



టెక్‌ఫెస్ట్‌లో విద్యార్థుల ప్రదర్శనను పరిశీలిస్తున్న అధ్యాపకులు



సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు అవిశ్వాసపత్రాన్ని అందజేస్తున్న కౌన్సిలర్లు

## చేర్యాలలో అవిశ్వాస కలకలం

- మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై కౌన్సిలర్ల అవిశ్వాసం
- అదనపు కలెక్టర్‌కు నోటీసు అందజేత
- 15 రోజుల్లోగా అవిశ్వాసం పెట్టే అవకాశం!

చేర్యాల, డిసెంబర్ 21: చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డిలపై బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించారు. కొంతకాలంగా అసంతృప్తిగా ఉన్న నలుగురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, ఐదుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు గురువారం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు అవిశ్వాసంపై సంతకాలు చేసిన పత్రాన్ని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు మంగోలు చంటి, ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీశ్‌గౌడ్, జుబేదాఖతూన్, కాంగ్రెస్ కౌన్సిలర్లు చెవిటి లింగం, సందుల సురేశ్, ఉడుముల ఇన్నమ్మ, ముస్త్యాల తార, తుమ్మలపల్లి సంజీవులు అందజేశారు. మున్సిపల్ చట్టం ప్రకారం 15 రోజుల్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని అదనపు కలెక్టర్ చెప్పారని కౌన్సిలర్లు తెలిపారు.

#### ఒక్కటైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు

మేజర్ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా 2018లో అవతరించిన తొలి ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు చెందిన ఐదుగురు సభ్యులు, కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు సభ్యులు, మరో ఇద్దరు ఇండిపెండెంట్లుగా విజయం సాధించారు. ఈ సమయంలో ఇండిపెండెంట్లుగా విజయం సాధించిన వారు బీఆర్‌ఎస్‌లో చేరడంతో మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగిరింది. ఈ సమయంలో చైర్‌పర్సన్‌గా అంకుగారి స్వరూపరాణి, వైస్ చైర్మన్‌గా నిమ్మ రాజీవ్‌రెడ్డి ఎన్నికయ్యారు. కొంతకాలంగా చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లపై సొంత పార్టీ కౌన్సిలర్లతోపాటు కాంగ్రెస్ కౌన్సిలర్లు అసంతృప్తిగా ఉన్నారు. గతంలోనే వీరిపై అవిశ్వాసం పెట్టేందుకు క్యాంపు రాజకీయాలు జరగడంతో నాటి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కలుగుజేసుకోవడంతో సమస్య సద్దుమణిగింది. తాజాగా రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ కౌన్సిలర్లు ఒక్కటై చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసం ప్రకటించడం స్థానికంగా చర్చనీయంగా మారింది.

# బీఆర్‌ఎస్ నాయకుడి అరెస్ట్‌ను నిరసిస్తూ ధర్నా

### మెదక్ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ శ్రేణుల బైఠాయింపు

మెదక్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): హవేలీ ఘనపూర్ మండలం గాజిరెడ్డిపల్లి బీఆర్‌ఎస్ నాయకుడు సాప సాయిలు అరెస్టును నిరసిస్తూ మెదక్ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం ఎదుట గురువారం బీఆర్‌ఎస్ శ్రేణులు ధర్నా చేపట్టారు. ధర్నాలో పాల్గొన్న జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకుడు సాప సాయిలును అటవీ శాఖ అధికారులు అక్రమంగా అరెస్టు చేసి తీసుకొచ్చారని ఆరోపించారు. అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ మెదక్ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం ఎదుట గాజిరెడ్డిపల్లి గ్రామస్తులు, బీఆర్‌ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించారు. సాప సాయిలుకు తక్షణమే స్టేషన్ బెయిల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి కానీ ఈ ప్రభు త్వం బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. కేసీఆర్ సర్కార్ హయంలో గాజిరెడ్డిపల్లిలో ఒక్క చెట్టు కూడా నరకలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా నాలుగు వేల మొక్కలు నాటితే అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జేసీబీ పెట్టి వాటిని తొలిగించినప్పుడు ఫారెస్ట్ అధికారులు చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఒక గుంట పొలం కూడా దున్నని వ్యక్తి మీద అక్రమంగా కేసు పెట్టడం దారుణం అన్నారు. అతడికి స్టేషన్ బెయిల్ ఇచ్చేంతవరకు ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం నుంచి కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. అటవీ అధికారులు బీఆర్‌ఎస్ నాయకుడు సాప సాయిలుకు స్టేషన్ బెయిల్ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



మెదక్ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

# క్రిస్మస్‌ను సంతోషంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, పక్కన అదనపు కలెక్టర్ రమేశ్

నర్సాపూర్, డిసెంబర్ 21: క్రిస్మస్ పండుగను క్రైస్తవులు సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కోరారు. గురువారం నర్సాపూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ రమేశ్‌తో కలిసి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పండుగలకు దుస్తుల పంపిణీ ఆనవాయితీగా వస్తున్నదని చెప్పారు. పండుగలకు కొత్త బట్టలు లేవనే లోటును తీర్చడానికి కేసీఆర్ సర్కార్ హయాంలో దుస్తుల పంపిణీని ప్రారంభించామని గుర్తుచేశారు. ఏసుక్రీస్తు మానవ రూపంలో జన్మించిన దేవుడని, ప్రతిఒక్కరినీ పుణ్యామార్గంలో నడిపించేలా చేశాడన్నారు. తనకు చిన్నప్పటి నుంచి చర్చికి వెళ్లే అలవాటు ఉన్నదని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అశోక్‌గౌడ్, తహసీల్దార్ కమలాద్రి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ నాయకులు సత్యంగౌడ్, సూరారం నర్సింహులు, సాగర్, షేక్‌హుస్సేన్, పాస్టర్లు పాల్గొన్నారు.

## ఏసయ్య దీవెనలు ప్రతిఒక్కరిపై ఉండాలి

శివ్వంపేట, డిసెంబర్ 21: సమాజంలో శాంతిని పెంపొందించి, అందరికీ ప్రేమను పంచాలని జన్మించిన పవిత్రమూర్తి ఏసుక్రీస్తు జననం ఒక స్ఫూర్తిదాయకమని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని సీతారాంతండాలో సర్పంచ్ సోని రవినాయక్ దంపతులు, తిమోతి, శారద దంపతుల ఆధ్వర్యంలో కల్వరి ప్రేమదార మందిరంలో గురువారం నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకలకు హాజరై మాట్లాడారు. పాస్టర్లు కోరిక మేరకు ప్రభుత్వం నుంచి ఇండ్లు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కేక్ కట్‌చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జడ్పీ కోఆప్షన్ మన్సూర్, బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షులు లావణ్యామాధవరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ లాయక్, మాజీ వైస్ ఎంపీపీ జ్యోతి ఆంజనేయులు, చింత స్వామి, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజేందర్‌నాయక్, మాజీ సర్పంచ్ కల్లూరి వెంకటేశ్, ఆయా చర్చిల పాస్టర్లు, భక్తులు పాల్గొన్నారు.